క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఎంపీ డీఓ సుధాకరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు, పోషకాహార పంపిణీ తదితర అంశాలకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీనరసమ్మను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కేంద్రాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

చెరుకు తోట దగ్ధం



వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట దళితవాడ సమీపంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో మునికృష్ణయ్య సాగు చేసిన చెరుకు తోట కాలిపోయింది. స్థానికుల కథనం మేరకు.. కొమరగుంట గ్రామానికి చెందిన మునికృష్ణయ్య ఊరికి సమీపంలో ఉన్న తన పొలంలో ఒకటిన్న ఎకరా విస్తీర్ణంలో చెరుకు పంటను సాగు చేశాడు. ఆ పొలంపై విద్యుత్ లైన్లు వెళుతున్నాయి. గురువారం మధ్యాహ్నం గాలికి వైర్లు ఒకదానికొకటి తగిలి, నిప్పురవ్వలు చెరుకులో పడ్డాయి. దీంతో తోటకు నిప్పు అంటుకుంది. గాలి బలంగా వీయడంతో చెరుకు తోట పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనలో సుమారు రూ. 2 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. పంట చేతికొచ్చే సమయంలో కాలిపోవడంతో దిగాలు పడ్డారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ సహాయకులు చెంగమ్మ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు.

ఘనంగా కుంభాభిషేకం



వెదురుకుప్పం: మండలంలోని పూలవారికండ్రిగలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయ కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం ఆలయంలో స్వామివారి చిత్రపటాన్ని ఉంచి, ప్రాణ ప్రతిష్ట చేశారు. రుత్వికుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కుంభాభిషేకం చేశారు. రాత్రి కోలాటాలు, భజనలు, టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టు కళాకారుల ఆధ్వర్యంలో భక్తి సంకీర్తన ఏర్పాటు చేశారు. భాగవతారిణి కౌసల్య ఆధ్వర్యంలో రుక్మిణీ కల్యాణం అనే హరికథా గానం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ద్విచక్రవాహనాల వేలం రేపు

పాలసముద్రం: మండలంలో సారా అక్రమంగా తరలిస్తూ పట్టుపడిన వాహనాలను శనివారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ బీ సురేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సారా కేసులు పట్టుపడిన రెండు ద్విచక్రవాహనాలను పాలసముద్రం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొన్న వచ్చని తెలిపారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయండి



కార్వేటినగరం: పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళి సూచించారు. గురువారం మండలంలోని ఆర్కేవీబీ పేట సమీపంలో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ లబ్ధిదారులందరూ పక్కాగృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి, ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గృహనిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కొటార్వేడు, గోపిశెట్టి పల్లె, అన్నూరు పంచాయతీల్లో పర్యటించి, గృహ నిర్మాణాలను పరిశీలించారు.

బాధ్యతగా పనిచేయాలి

పాలసముద్రం: మండలంలోని సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేయడంతోపాటు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఎస్ విద్యావతి తెలిపారు. గురువారం ఆమె తిరుమలరాజుపురం సచివాలయాన్ని సందర్శించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసమే ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకు వచ్చిందన్నారు. ఆ వ్యవస్థలో ఉద్యోగులు బాధ్యతగా చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. సచివాలయంలో ఇంతవరకు ప్రజల నుంచి ఎన్ని సమస్యలు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారని కార్యదర్శి నరేష్‌ని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల జాబితా చార్టు ఏర్పాటు చేయాలన్నారు.

తరిమికొడదోమా



- ఫాగింగ్ యంత్రాల పంపిణీ
- నిర్వహణ బాధ్యత పంచాయతీలదే

దోమలతో వచ్చే అనర్థాలు అన్నీ ఇన్ని కావు. వీటి కాటుకు గురైతే అనారోగ్యం బారిన పడడం ఖాయం. నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికి సైతం భరోసా ఉండదు. దోమల కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారని భావించిన ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఒక ఫాగింగ్ మిషన్‌ను పంపిణీ చేసింది. వీటి వినియోగంతో దోమలు తరిమికొట్టినట్టేనని అందరూ భావిస్తున్నారు. –పాలసముద్రం



ఫాగింగ్ యంత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ (ఫైల్)

దోమ చూడ్డానికి చిన్నగా ఉంటుంది. కానీ అది కుడితే ప్రాణాంతక వ్యాధులకు గురి కావాల్సిందే. వర్షాకాలంతోపాటు ఇతర కాలాల్లో కూడా దోమలు మనిషి ఆరోగ్యంపై పెను ప్రభావాన్ని చూపుతున్నాయి. దోమలతో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు పలు చర్యలు చేపడుతోంది. అయినా దోమల బెడద తప్పడం లేదు. ఫలితంగా జనానికి కంటి మీద కునుకు లేకుండా పోతోంది. దోమలను పూర్తిస్థాయిలో నివారించి, ప్రజారోగ్యం మెరుగు పరిచేందుకు ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్)లో భాగంగా అన్ని పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలతో పాటు హైప్రెషర్ టాయిటెట్ క్లీనర్లు, తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్లు సమకూర్చుతోంది. వీటిని వినియోగిస్తే దోమలను నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఒక

మండలం	పంచాయతీలు	ఫాగింగ్ మెషీన్లు
గంగాధరనెల్లూరు	32	20
శ్రీరంగరాజపురం	23	18
కార్వేటినగరం	22	15
వెదురుకుప్పం	25	12
పెనుమూరు	25	25
పాలసముద్రం	13	13

ఫాగింగ్ మెషీన్ కొనుగోలుకు రూ.35 నుంచి రూ.45 వేలు వరకు ప్రభుత్వం వెచ్చిస్తోంది. చిన్న గ్రామాలు అయితే రెండింటికి ఒకటి, పెద్ద గ్రామాలకు ఒక ఫాగింగ్ మెషీను అందజేసింది. అయితే ఈ మిషన్ల నిర్వహణ బాధ్యతలను పంచాయతీలే చూసుకోవాలి.

ప్రయోజనాలివీ..

ఫాగింగ్ యంత్రాల ద్వారా డీజిల్, మొలాథియన్ కలిపి వదిలే పొగ వల్ల డెంగీ, మలేరియా, చికున్‌గున్యా దోమలు నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. దోమల బెడదతో వ్యాధులు ప్రబలినప్పుడు ఆ ప్రాంతంలో వారానికి ఒకసారి చొప్పున నాలుగు వారాలు ఫాగింగ్ మెషీన్ ద్వారా పొగ వదిలితే మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

మంచి నిర్ణయం



ప్రతి చోట దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీటిని నిర్మూలించేందుకు ఫాగింగ్ యంత్రాలు ఎంతో ఉపయోగపడ తాయి. ఇంచుమించు ప్రతి పంచాయతీకి ఈ యంత్రాలు అందుబాటులోకి రావడం హర్షణీయం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది.

–ఎస్ శ్యామల, ఎంపీపీ, పాలసముద్రం

వినియోగించుకోవాలి



ప్రభుత్వం సమకూర్చిన ఫాగింగ్ మెషీన్లు నిర్వహణ పంచాయతీలకే ఉంటుంది. దోమల బెడద ఉంటే ఫాగింగ్ మెషీన్లను ఉపయోగించాలి. డస్టుబిన్‌లో తడి, పొడిచెత్తను వేరు చేసి వాటిని సేరించి సంపద కేంద్రాలను తరలిస్తారు. గ్రామాల్లో వినియోగంలోకి వస్తే వ్యాధులు నివారణ సాధ్యం. దీంతో దోమల బెడద ఉండదు.

–కే.విద్యావతి, ఎంపీడీఓ

వ్యాధులకు చెక్



ఫాగింగ్ మెషీన్ల వినియోగంతో గ్రామాల్లో దోమల కారణంగా ప్రబలే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులు అరికట్టడానికి వీలు పడుతుంది. రాత్రి సమయంలో డీజిల్ మొలాథియన్ కలిపి పొగను వీధులలో వదలడం వల్ల దోమలు నివారణ సాధ్యం అవుతుంది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రజలకు మేలు జరుగుతుంది.

–మోహన్‌కృష్ణ, వైద్యాధికారి, పాలసముద్రం

దోమల బెడద నుంచి విముక్తి



దోమలను పూర్తిస్థాయిలో నివారించి ప్రజారోగ్యాన్ని మెరుగు పర్చేందుకు ప్రభుత్వం పంచాయతీలకు ఫాగింగ్ మెషీన్లతో పాటు హైప్రెషర్ టాయిటెట్ క్లీనర్, తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్లను అందజేసింది. వీటిని వినియోగంతో దోమలను నివారించవచ్చు. ప్రభుత్వ ఆశయంతో పంచాయతీలకు మేలు జరిగింది.

–జీ.మహేహష్ బాబు, శ్రీకావేరిరాజుపురం సర్పంచ్

జీ-20 సదస్సుపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య

పుత్తూరు రూరల్: దేశంలో సెప్టెంబర్‌లో నిర్వహించనున్న జీ-20 సదస్సుపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య అన్నారు. గురువారం కళాశాలలో ఎన్‌సీసీ విభాగం వారు జీ-20 సదస్సుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొలిసారిగా జీ-20 సదస్సు దేశంలో జరగడం ప్రతి భారతీయుడికీ గర్వకారణమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అతివేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ గల దేశాధినేతలు సదస్సుకు హాజరవుతున్నారని తెలిపారు. మనదేశం 1999 నుంచి జీ-20లో సభ్యదేశంగా ఉందన్నారు. అనంతరం అధ్యాపకులు నరసింహులు, విష్ణుప్రకాష్, శ్రీనివాసులు ప్రసంగించారు.

దోమ లార్వాల వృద్ధిని అరికట్టాలి



మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

పాలసముద్రం: గ్రామాల్లో దోమలు, లార్వాలు వృద్ధి చెందకుండా అరికట్టాలని పుత్తూరు సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు తెలిపారు. గురువారం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల, మురళి ఆధ్వర్యంలో ప్రభుత్వ వసతి గృహాలకు వెళ్లి దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు భోజనం చేయక ముందే చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే జ్వరం, దగ్గు, జలుబు తదితర వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు.

వైభవంగా మహా కుంభాభిషేకం

శ్రీరంగరాజపురం: మండలంలోని మొదవాడలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణస్వామి ఆలయ మహా కుంభాభిషేకం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు వేద మంత్రాల నడుమ హోమం నిర్వహించారు. తరువాత మహా కుంభాభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. దాతలు మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు. రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు.

'వన్నె'తెచ్చి జగనన్నకు రుణపడి ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి

కార్వేటినగరం: వన్నెకుల క్షత్రియులు రాజకీయంగా ఎదగడానికి అవకాశం ఇచ్చి, తమ సామాజిక వర్గానికి వన్నెతెచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని సుబ్రమణ్యస్వామి ఆలయ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ సమానత్వానికి నోచుకోని వన్నెకుల క్షత్రియులకు నేడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానం కల్పించిన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షురాలు మోహన కుమారి మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించారన్నారు. ఏఎంసీ డైరెక్టర్ గోపి, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణ యాదవ్, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు గిరిజారెడ్డి, కట్ల రవిరెడ్డి, దాముర్రెడ్డి, పయణిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్ మొదలియార్, గోవిందరెడ్డి, వెంకటరత్నం, రత్నంరెడ్డి, దొరబాబు, చందురాజు, శేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గుట్టలకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు



గంగాధరనెల్లూరు: కొంతమంది ఆకతాయిలు గుట్టలకు నిప్పు పెట్టడంతో పర్యావరణానికి ముప్పు కలుగుతోంది. మండలంలో చిన్నవి,పెద్దవి కలిపి మొత్తం 22 గుట్టలు ఉన్నాయి. వీటికి ఎండాకాలం వచ్చిందంటే నిప్పు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. నిప్పు పెట్టడంతో పచ్చని చెట్ల సహా అందులో ఉండే జంతువులు, పక్షులు కాలిపోతున్నాయి. అధికారులు దీనిపై నిఘా ఉంచి నిప్పు పెట్టేవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రీ సర్వేలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి



సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

పాలసముద్రం: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకంలో భాగంగా నిర్వహించే రీ సర్వేలో రెవెన్యూ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ సుజన తెలిపారు. గురువారం మండలంలోని సింహరాజుపురం, పాలసముద్రం రెవెన్యూ డివిజన్‌లో జరుగుతున్న రీ సర్వే పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ భూములున్న రైతుల వద్ద తప్పకుండా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు, ఫోన్ నంబర్, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో భూమి ఉండి రైతులు మరణించినట్లయితే వారి వారసులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రీ సర్వే అయిపోతే వాటిని మార్చడానికి వీలుకాదని తెలిపారు. అనంతరం శ్రీకావేరిరాజుపురం సచివాలయాన్ని ఆమె తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. నూతన సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. తహసీల్దార్ బాబు, సర్పంచ్ గాలి మహేష్ బాబు, వీఆర్వో తంగరాజ్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

వడమాలపేట: మండలంలోని రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ విజయ కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ-క్రాప్ నమోదు పకడ్బందీగా చేపట్టాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈఓలకు సూచించారు. రైతులు పంట నమోదుతో ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, సున్నా వడ్డీ, పంట నష్ట పరిహారం తదితర ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. ప్రతి రైతు ఆర్బీకేలను సందర్శించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

డ్రాపొట్లకు రీ అడ్మిషన్లు

వెదురుకుప్పం: ఇంటర్ చదువుతూ మధ్యలో కళాశాలకు రాకుండా ఆపేసిన విద్యార్థులకు మళ్లీ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నిర్మలకుమారి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ గతంలో ఏ గ్రూపులోనైనా కళాశాలకు రాకుండా నిలిచిపోయిన విద్యార్థులకు ప్రభుత్వం సార్వత్రిక విధానం ద్వారా ఇంటర్‌లో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. వీరికి ఏప్రిల్‌లో పరీక్షలు ఉంటాయన్నారు. ఆ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

తప్పుడు కథనాలు రాస్తే మూల్యం తప్పదు

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తప్పుడు కథనాలు సృష్టించి ప్రజలు దృష్టిని మళ్లించేందుకు చూస్తున్న ఈనాడు పత్రిక యాజమాన్యం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పార్టీశ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు దాసోహం అంటున్న ఈనాడు పత్రిక యాజమాని రామోజీ రావు అసత్య కథనాలు రాస్తూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విషప్రచారం చేయడం మంచిది కాదని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దూది మోహన్, జిల్లా యువత ప్రధాన కార్యదర్శి విజయకుమార్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, యతీశ్వరనాయుడు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులు పూర్తి చేయాలి



గృహనిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఏఈ మధు, శివప్రకాష్ రాజు

పాలసముద్రం: మండలంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహనిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ మధు తెలిపారు. గురువారం సన్నగుంట సమీపంలోని జనగర్ జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణ పనులను పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చెర్మన్ ఎస్ శివప్రకాష్ రాజు, హౌసింగ్ సిబ్బంది కలసి పరిశీలించారు. ఏఈ మధు మాట్లాడుతూ జగనన్న గృహనిర్మాణ పనులు వేగవంతం చేసి, ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు. ఎస్ శివప్రకాష్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం లేఅవుట్‌లలో తాగునీరు, విద్యు త్, రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించిందన్నారు. ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్, సకాలంలో బిల్లు చెల్లిస్తున్నారని చెప్పారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని త్వరగా గృహనిర్మాణ పను లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ అక్షయకుమార్, సూపర్‌వైజర్ బాబు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చేయాలి

పాలసముద్రం: మండలంలోని రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించిన చేసిన ఈ-క్రాప్ నమోదును ఆన్‌లైన్ చేయాలని ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. గురువారం పాలసముద్రం సచివాలయ ఆవరణలో అన్ని సచివాలయాల వ్యవసాయ సహాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల వ్యవసాయ సహాయకులకు వారికి కేటాయించిన సచివాయల పరిధిలోని ప్రతి గ్రామంలో రైతులకు పంటల సాగు ఎలా చేయాలి, ఎరువు, మందులు పిచికారీపై వివరించాలన్నారు. ప్రస్తుతం రైతులు వరి సాగుపై చేస్తున్నారని, ఆ పంటకు సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడేలా అవగాహన కల్పించాలన్నారు.

అందరినీ చల్లగా దీవించు విఘ్నేశ్వరా!



నగరి: దేశమ్మ ఆలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి ఆర్కేరోజా



పుత్తూరు రూరల్: పూజల్లో పాల్గొన్న మంత్రి

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రజలందరూ చల్లగా ఉండేలా దీవించమని వినాయకస్వామిని కోరుకున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. గురువారం మున్సిపాలిటీలోని 11వ వార్డు విద్యానగర్‌లో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయ మహాకుంభాభిషేకం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి రోజా మాట్లాడుతూ ఆలయ నిర్వహణ బాధ్యతలను కమిటీ సభ్యులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్క నాటారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, ఆరేటమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ జాన్ కెనడీ, నాయకులు గజేంద్రనాయుడు, చిన్నా, గంగయ్య పాల్గొన్నారు.

ఆలయ పనులు పరిశీలించిన మంత్రి రోజా

నగరి: మున్సిపల్ పరిధిలోని టీఆర్ కండ్రిగలో నేత్ర ప్రదాత దేశమ్మ దేవాలయ నిర్మాణ పనులను మంత్రి ఆర్కేరోజా మంగళవారం పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి రూ.కోటి నిధులు మంజూరు చేయించగా బాలాలయ పూజలు ముగిసిన తరువాత పాత ఆలయాన్ని తొలగించారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణానికి పునాదులు వేసే పనులు జరుగుతున్నాయి. ఆ పనులను మంత్రి పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం బాలాలయంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ప్రసాదాలు అందజేశారు. ఆలయాన్ని త్వరగా నిర్మించి కుంభాభిషేకం రోజున మళ్లీ అమ్మ వారికి అష్టబంధనం చేసి, ప్రాణప్రతిష్ట చేయాలన్నారు. రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, దేశమ్మ దేవాలయ మాజీ చైర్మన్ దయానిధి, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కుల మతాలకతీతమైనది జెండా పండుగ

వడమాలపేట: కుల, మతాల కతీతంగా హిందువులు, ముస్లింలు కలిసి చేసుకునే పండుగ పీర్ల జెండా పండుగ అని మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం మండలంలోని వెంగళరాజుకండ్రిగలో పీర్ల జెండా ఊరేగింపు కార్యక్రమం పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ దేవుళ్లు అందరూ ఒక్కరే అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రయాదవ్, సదాశివయ్య, ధర్మయ్య, వెంకటసుబ్బయ్య, రమేష్, సురేష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఎంతో మేలు



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పాలసముద్రం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందజేస్తున్న పోషణ ఆహారంతో గర్భిణులు, బాలింతలకు ఎంతో మేలని వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ తెలిపారు. గురువారం వెంగళరాజుకుప్పం దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రాధ అధ్యక్షతన గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ లిల్లీ, వైస్ ఎంపీపీ పుష్ప మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, చిన్నారులకు మధ్యాహ్నభోజనం నాణ్యతగా పెట్టాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహా రం పంపిణీ చేశారు. వైస్ సర్పంచ్ సుమన్ పాల్గొన్నారు.

ఫార్మా రంగానికి మంచి భవిత



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

నగరి : ఫార్మారంగానికి మంచి భవిష్యత్ ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వేణుగోపాల్ అన్నారు. కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఫార్మ ఇండస్ట్రీలో సైన్స్ చదివిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మారంగానికి భవిష్యత్తులో గొప్ప అవకాశాలు ఉన్నాయన్నారు. పుత్తూరు కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ డాక్టర్ ఏ రమేష్ బాబు మాట్లాడుతూ ఫార్మా రంగంలో ఉన్న డ్రగ్స్ రకాలు, తయారు చేయడానికి ఎటువంటి ఫార్ములాని వాడుతారన్న అంశంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఇందిరా ప్రియదర్శిని, అరుణకుమారి, సుహాసిని, నర్సయ్య, శివలక్ష్మి, మునికుమారి, నాగార్జున, లాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



ఇంటిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

పాలసముద్రం: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని బలిజకండ్రిగ హైస్కూల్ హెచ్‌ఎం మనోహర్ నాయుడు తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురంలో ఇంటిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు దొరస్వామి, రమేష్ మాట్లాడి వారికి సూచనలిచ్చారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి వద్ద టీవీలు, సెల్‌ఫోన్ చూడకుండా పాఠాలను చదివించాలన్నారు. అప్పుడే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. బలిజకండ్రిగ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటి వద్ద సక్రమంగా చదువుతున్నారా? లేదా అని ఉపాధ్యాయులు ఐదు గ్రూపులుగా గ్రామాల్లో పర్యటిస్తూ పదో విద్యార్థుల చదువులపై నిఘా పెట్టారని చెప్పారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారు చదువుతున్నారా? లేదా అని పరిశీలిస్తున్నామన్నాని తెలిపారు. తమకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరిస్తే వందశాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా పనిచేయండి

నింద్ర: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆర్బీకేలు పని చేయాలని ఆర్బీకే మండల చైర్మన్ వీరయ్యనాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఇరుగువాయి, అగరం ఆర్బీకేని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన సూచనలతో రైతుల పంట సాగు చేసి, అధిక దిగుబడులు సాధించాలన్నారు.